సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం । 7 । మే । 2024



టెక్కలిలో నూతనోత్సాహం

టెక్కలి వైఎస్సార్‌సీపీలో నూతన ఉత్సాహం కనిపిస్తోంది. టీడీపీ నుంచి వచ్చి పార్టీలో చేరుతున్నారు. - 8లో



కరుణించిన వరుణుడు

ఎట్టకేలకు వరుణుడు కరుణించాడు. పలుచోట్ల జల్లులు కురిపించాడు. - 8లో

యథావిధిగా డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఈ నెల 8వ తేదీన నిర్వహించనున్న డిగ్రీ మొదటి ఏడాది రెండో సెమిస్టర్ పరీక్ష యథావిధిగా నిర్వహించనున్నట్లు ఎగ్జామినేషన్స్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. వర్సిటీ నుంచి సోమవారం ప్రకటన విడుదల చేశారు. స్టాక్ మార్కెట్ ఆపరేషన్స్ పరీక్ష ముందుగా ప్రకటించిన షెడ్యూల్ మేరకు ఉదయం 9 గంటలు నుంచి 10.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు.

న్యూస్‌రీల్

విద్యుత్ సమస్యలపై పరిష్కార వేదిక

టెక్కలి రూరల్: విద్యుత్ సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి సంబంధించిన చర్యలు తీసుకునేందుకు గాను స్థానిక డివిజనల్ కార్యాలయంలో 8న పరిష్కార వేదిక ఏర్పాటు చేయనున్నట్లు ఈఈ జి.శంకరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు బుధవారం సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు. టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి మండల పరిధిలోని వినియోగదారులు విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

ఆర్‌జీయూకేటీలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రతిష్టాత్మక విద్యాసంస్థ రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో ప్రవేశాలకు ప్రవేశాల కన్వీనర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. 10వ తరగతి మార్కులు ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు వెయిటేజీ ఇస్తారు. ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు లభిస్తాయి. శ్రీకాకుళం, ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు క్యాంపస్‌ల్లో విద్యార్థులు ప్రాధాన్యత క్రమంలో ప్రవేశాలు కల్పిస్తారు. ప్రస్తుతం ఒక సంస్థలో 1000 సీట్లు ఉండగా, ఈడబ్ల్యూఎస్ కింద 10 శాతం ప్రవేశాలు కల్పిస్తారు. ప్రీ యూనివర్సిటీ కోర్సు రెండేళ్లు, ఇంజినీరింగ్ కోర్సు నాలుగేళ్ల మొత్తం ఆరేళ్లు విద్యార్థులు చదివే అవకాశం లభిస్తుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఈ నెల 8వ తేదీ నుంచి స్వీకరిస్తారు. పూర్తి వివరాలు డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.ఆర్‌జీయూకేటీ.ఇన్ వెబ్‌సైట్‌లో లభిస్తాయి.

వైద్యారోగ్య శాఖలో నలుగురికి షోకాజ్ నోటీసులు



జనసేన నేత డాక్టర్ శ్రీధర్‌ను కలిసిన వైద్య శాఖ సిబ్బంది


అరసవల్లి: జిల్లా వైద్యారోగ్య శాఖలో నలుగురు ఉద్యోగుల తీరు వివాదాస్పదమైంది. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కమిషనర్ ఆదేశాల ప్రకారం జిల్లాలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారుల బృందం పలు ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో అగ్ని ప్రమాద నివారణ పరికరాలు, విద్యుత్ షార్టు సర్క్యూట్ కాకుండా తీసుకుంటున్న జాగ్రత్తలు తదితర సౌకర్యాలపై తనిఖీలు చేపట్టింది. ఈ క్రమంలో జనసేన నాయకుడు దానేటి శ్రీధర్‌కు చెందిన ఆస్పత్రులను కూడా తనిఖీ చేశారు. అయితే ఆ సమయంలో నలుగురు సిబ్బంది ఆయనతో ఫొటోలు దిగడం వివాదాస్పదమైంది. మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, డిప్యూటీ డెమో వెంకటేశ్వర్లు, హెల్త్ ఎడ్యుకేటర్ మోహిని, అటెండర్ పైడి కీర్తి తదితరులు ఎన్నికల నియమావళిని అతిక్రమించినట్లుగా అధికారులు గుర్తించారు. దీంతో వీరు నలుగురికి షోకాజ్ నోటీసులు జారీ చేశామని, వారి వివరణ ప్రకారం తదుపరి చర్యలుంటాయని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి తెలియజేశారు. ప్రభుత్వ ఉద్యోగులు విధుల్లో భాగంగా కచ్చితంగా ఎన్నికల కోడ్ నిబంధనలను పాటించాలని, ఈ విషయంలో ఎన్నికల కమిషన్ ఎవ్వరినీ ఉపేక్షించదని హెచ్చరించారు.

ప్రధాన ప్రతిపక్షం

రాక్షస రాజకీయం

- ఐదేళ్లుగా కుట్రలు, కుతంత్రాలతోనే టీడీపీ సావాసం
- ప్రజలను రెచ్చగొట్టి లబ్ధి పొందేందుకు యత్నం
- మత విద్వేషాలు, విగ్రహ విధ్వంసాలతో రాక్షసానందం
- కుట్రలు పన్నిన ప్రతి సారి దొరికిపోయిన పచ్చనేతలు

విగ్రహాలు విరగ్గొట్టడం, జనాలను రెచ్చగొట్టడం, ప్రశ్న పత్రాలు లీకేజీ చేయడం, ఫేక్ ప్రెస్‌నోట్లు రిలీజ్ చేయడం.. ఐదేళ్ల పాటు టీడీపీ సాగించిన వికృత రాజకీయమిది. ప్రజలు ప్రతిపక్ష స్థానమిస్తే.. ఆ స్థానానికి కూడా మచ్చ తెచ్చే రీతిలో ఈ ఐదేళ్లూ పచ్చ నాయకులు వ్యవహరించారు. కుట్రలు పన్నిన ప్రతిసారీ అడ్డంగా దొరికిపోయినా.. మళ్లీ మళ్లీ అవే కుతంత్రాలకు పాల్పడ్డారు. ఎలాగైనా ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని, జనం దృష్టిలో తాము హీరోలమైపోవాలని తెగ తాపత్రయ పడి బొక్కబోర్లా పడ్డారు.



పచ్చ పాపాలు- II



- 2021 జనవరి 4వ తేదీన టెక్కలి ఆది ఆంధ్రావీధి సమీపంలో గల సమగ్ర రక్షిత మంచి నీటి పథకానికి ఆనుకుని ఉన్న పార్కులో ఎప్పుడో విరిగిపోయిన బుద్ధుని విగ్రహం మణికట్టు చేయిని పట్టుకుని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు అనుచరులు రాజకీయ రాద్ధాంతం చేద్దామనుకున్నారు. విగ్రహంతో మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు యత్నించారు. అచ్చెన్నాయుడు మనుషులంతా అక్కడకు చేరుకుని ఆందోళనకు దిగారు. తీరా ఆ విగ్రహం మణికట్టు చేయి మూడు నెలల కిందటే ఊడిపోయిందని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో అతికించామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఘాటుగా చెప్పడంతో బొక్కా బోర్లా పడ్డారు.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ఒకటా.. రెండా.. టీడీపీ నేతలు ఐదేళ్ల పాటు సాగించిన విధ్వంస రాజకీయ కాండకు ప్రతి మండలంలోనూ ఆనవాళ్లు ఉన్నాయి. ప్రజా సంక్షేమాన్ని పక్కన పెట్టి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడమే పనిగా ఈ ఐదేళ్ల పాటు వారు కుట్రలు పన్నారు. బాధ్యత గల ప్రతిపక్షంగా ప్రజా సమస్యలపై పోరాడాలి. ప్రజల పక్షాన ఆందోళనలు చేయాలి. తద్వారా ప్రజల మన్ననలు పొందాలి. కానీ టీడీపీ నాయకులు గత సార్వత్రిక ఎన్నికల దగ్గరి నుంచి నేటి వరకు కుట్రలు, కుతంత్రాలనే నమ్ముకున్నారు. తాజాగా జరుగుతున్న ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ దుష్ప్రచారం అందులో భాగమే. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ మంచిదని, ఇలాంటి చట్టం రావాలని, దానికి అసెంబ్లీలో ఆమోదించాలని సాక్షాత్తు శాసనసభలో టీడీపీ నాయకులు మాట్లాడారు. 'ఈనాడు' పత్రిక కూడా దీనికి మద్దతు తెలుపుతూ ఈటీవీలో ప్రత్యేక కథనం టెలికాస్ట్ చేసింది. కానీ ఎన్నికల సందర్భంగా అదే యాక్ట్‌పై నానా రభస సృష్టించి జనాలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారు.

ప్రజలకు మంచి చేద్దాం, అధికారంలోకి వస్తే మరింత మేలు చేస్తామని చెప్పుకోవడం మానేసి ప్రభుత్వంపై పనిగట్టుకుని విషం ప్రచారం చేశారు. కానీ ప్రతి సారీ కళ్లకు కట్టినట్టు అధారాలతో సహా దొరికిపోయి కటకటాల్లోకి వెళ్లారు.

- 2022 జూన్‌లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అనుచరుడైన సంతబొమ్మాళి మండలం బోరుబద్ర గ్రామానికి చెందిన అప్పిని వెంకటేష్ అమ్మ ఒడి, వాహనమిత్ర పథకాలను ఆర్థిక ఇబ్బందులు కారణంగా రద్దు చేయడం జరిగిందంటూ ఆంధ్రప్రదేశ్ సమాచార సాంకేతిక, ప్రసారాల శాఖ ప్రెస్‌నోట్ జారీ చేసినట్టుగా ఒక ఫేక్ ప్రెస్‌నోట్‌ను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసి దుష్ప్రచారానికి దిగారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ రకంగా సోషల్ మీడియాలో నకిలీ ప్రకటనలతో విష ప్రచారం చేసిన ఐదుగుర్ని సీఐడీ అధికారులు గుర్తించగా, అందులో మన జిల్లాకు చెందిన అచ్చెన్నాయుడు అనుచరుడు వెంకటేష్ ఉన్నారు.







- 2022లో సరుబుజ్జిలి మండలం రొట్టవలస, కొత్తకోట జెడ్పీహెచ్ స్కూళ్లలో పదో తరగతి హిందీ ప్రశ్న పత్రం టీడీపీ నాయకులు లీక్ చేసి, దాన్ని ప్రభుత్వంపై మోపి దుష్ప్రచారానికి యత్నించి దొరికిపోయారు. చివరికి వారంతా అరెస్టయ్యారు.

- 2021 జనవరి 14వ తేదీన సంతబొమ్మాళి మండలం పాలేశ్వరస్వామి ఆలయంలో ఏకంగా అపచారానికి పాల్పడ్డారు. పాడైన నంది విగ్రహం తరలించి హిందూ ఆగమ శాస్త్రానికి విరుద్ధంగా దగ్గర ఉన్న జంక్షన్‌లో ఉత్తర దిక్కు వైపు ప్రతిష్టించి అపహాస్యం చేశారు. పాలేశ్వరస్వామి ఆలయం జంక్షన్‌లోని ఆర్అండ్‌బీ స్థలంలో ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మపై వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు చేద్దామని వైఎస్సార్ సీపీ నాయకులు భావించారు. దీంతో కుట్ర పూరితంగా రాత్రికి రాత్రి పాలేశ్వర స్వామి ఆలయంలో అప్పటికే తొలగించి ఉన్న పాడైన నంది విగ్రహాన్ని తీసుకెళ్లి వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు చేద్దామనకున్న సిమెంట్ దిమ్మపై ఉత్తర దిక్కు వైపు ప్రతిష్టించారు. ఒక వైపు మత విద్వేషాలు రెచ్చగొట్టొచ్చని, మరోవైపు వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు చేయకుండా అడ్డుకోవచ్చన్న ద్విముఖ వ్యూహంతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు బ్యాచ్ పక్కా ప్లాన్ చేశారు. కానీ సీసీ కెమెరాలో అన్నీ రికార్డు రావడంతో వారి బండారం బయటపడింది. 22 మందిపై కేసులు కూడా నమోదయ్యాయి.



కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

శ్రీకాకుళం పాతబస్టాండ్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ మూడో రోజు కూడా సజావుగా జరిగింది. ఇప్పటికే రెండు రోజులు పాటు ఈ బ్యాలెట్ ఓటుని వినియోగించుకున్నారు. మూడో రోజు సోమవారం జిల్లా లోని 8 నియోజకవర్గాల్లో నిర్దేశిత కేంద్రాల్లో ఈ పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను నిర్వహించారు. మూడో రోజున పోలీస్, ప్రైవేట్ డ్రైవర్స్, ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవర్లు, వీడియోగ్రాఫర్లు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, ఎక్స్ సర్వీస్ మెన్‌లు ఓటు వేశారు. ఇచ్ఛాపురంలో 106, పలాసలో 112, టెక్కలిలో 211, పాతపట్నంలో 152, శ్రీకాకుళంలో 333, ఆమదాలవలసలో 243, ఎచ్చెర్లలో 140, నరసన్నపేటలో 175 ఓట్లు పడ్డాయి. మొత్తం మూడో రోజు 1472 ఓట్లు పడ్డాయి. ఎంపీ స్థానానికి 1332 ఓట్లు పడ్డాయి. మూడు రోజులకు కలిపి 18,964 మంది ఓటేశారు.

ప్రశాంతంగా హోమ్ ఓటింగ్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో సోమవారం హోమ్ ఓటింగ్ ప్రశాంతంగా ముగిసింది. వయోవృద్ధులు, దివ్యాంగులు వారి ఓటును ఇంటి వద్ద నుంచే వేసేలా ఈ సారి ఎన్నికల కమిషన్ వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు జిల్లాలో ఈ హోం ఓటింగ్‌కు సిబ్బంది ఓటరు ఇంటి వద్దకే వెళ్లి రహస్య ఓటింగ్ విధానంలో వారి ఓటును వేయించారు. జిల్లాలో 494 మంది హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోగా.. 474 మంది ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు. 12 మంది మరణించగా, ముగ్గురు గైర్హాజరయ్యారు. ఐదుగురు ఇంటి వద్ద లేరు.



రణస్థలంలోని ఓ ఇంటిలో హోమ్ ఓటింగ్

హోమ్ ఓటింగ్

నియోజకవర్గం	దరఖాస్తు చేసుకున్న వారు	ఓటు వేసిన వారు
ఇచ్ఛాపురం	110	107
పలాస	10	10
టెక్కలి	26	24
పాతపట్నం	24	24
శ్రీకాకుళం	80	77
ఆమదాలవలస	46	44
ఎచ్చెర్ల	83	78
నరసన్నపేట	115	110
మొత్తం	494	474

మేమంతా సిద్ధం

- నేడు ఇచ్ఛాపురంలో సీఎం వైఎస్ జగన్ బహిరంగ సభ



సెక్యూరిటీ అధికారులతో కలిసి హెలీప్యాడ్‌ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్



పార్టీ నాయకులకు సూచనలిస్తున్న ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్

ఇచ్ఛాపురం: పట్టణంలో మంగళవారం జరగనున్న మేమంతా సిద్ధం సభను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ అన్నారు. పట్టణంలోని క్రిస్టియన్ మైనారిటీ సెల్ కార్యాలయం ఆవరణంలో సోమవారం పార్టీ ముఖ్యనేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభను విజయవంతం చేసేందుకు అవసరమైన సలహాలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్లు ఉలాల భారతిదివ్య, లాబాల స్వర్ణమణి, పట్టణ అ ధ్యక్షుడు ప్రకాశరావు, కౌన్సిలర్లు పట్నాయక్, సుగ్గు ప్రేమ్‌కుమార్, మధుమూర్తి బి.జగన్, జి.ప్రదీప్, పార్టీ ముఖ్యనేతలు పిలక సంతు, ప్రత్తి అన్వేష్, పరపటి కోటి, పిలక విజయ్‌భాస్కర్, కాళ్లసత్యం, చాట్ల లోహిదాస్, టెంక లోకేష్, గాంధీ, దక్కత లోకనాథం, బర్ల లక్ష్మణరావు, కృష్ణారావు పాత్రో, మదన్, కిరణ్ బెహర, గుజ్జు తారకేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఆ ఏర్పాట్లను ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం హెలికాప్టర్ దిగేందుకు పండాకాలనీ వెనుక ఏర్పాటుచేయనున్న హెలీప్యాడ్‌ను పరిశీలించారు. ఈ ప్రాంతంలో దిగిన సీఎం మున్సిపల్ కార్యాలయం, బంగ్లా రోడ్ కూడలిలో వద్ద ఏర్పాటు చేయనున్న రోడ్‌షోలో పాల్గొనేందుకు వచ్చే రూట్‌ని సెక్యూరిటీ అధికారులతో కలసి పరిశీలించారు. అనంతరం సెక్యూరిటీ విభాగం వారి సూచనలతో రూట్‌మ్యాప్ తయారవుతుందని పార్టీ పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చింతాడ రవికుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు నర్తు నరేంద్ర యాదవ్, పిలక సంతు, ప్రత్తి అన్వేష్, చాట్ల లోహిదాస్, చిట్టిబాబు, ప్రకాశరావు పట్నాయక్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన విజయవంతం చేయాలి

- నేడు మధ్యాహ్నం 2 గంటలకు ప్రచార సభ
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం ఇచ్ఛాపురం రానున్నారు. సీఎం వైఎస్ జగన్ పర్యటనని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో కోరారు. ఇచ్ఛాపురంలో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఎన్నికల ప్రచార సభలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాల్గొంటారని తెలిపారు. రోడ్ షో కూడా ఉంటుందని, ఈ పర్యటనలో పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కళ్ల ముందే ప్రగతి..

ఇచ్ఛాపురంలో దశాబ్దాలుగా టీడీపీ నాయకులు చేయలేని పనులు వైఎస్సార్ సీపీ సారథ్యంలో ఐదేళ్లలోనే జరిగాయి. జెడ్పీ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, ఎమ్మెల్సీ నర్తు రామారావు సమస్యలను గుర్తించడం, ప్రభుత్వానికి నివేదించడంతో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న చాలా పనులు పూర్తయ్యాయి. ఓట్లు దండుకోవడం తప్ప పనులు చేయలేని టీడీపీ నాయకులు ప్రతి ఎన్నికల్లో వీటిని హామీలుగా వాడుకోవడం తప్పితే ఇంకేమీ చేయలేకపోయారు. కానీ వైఎస్సార్ సీపీ సర్కారు మాత్రం పనులు చేసి చూపించింది. - ఇచ్ఛాపురం రూరల్

అభివృద్ధి పథం సంక్షేమ రథం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన బెన్నుగానిపేట రోడ్డు



నాడు: బెన్నుగానిపేట రహదారి దుస్థితి

ఇది బాలకృష్ణాపురం నుంచి బెన్నుగాని పేట వరకు రోడ్డు. 2019 ఫిబ్రవరి 18న స్థానిక టీడీపీ ఎమ్మెల్యే బెందాళం అశోక్ శిలాఫలకం వేశారు. 2014 నుంచి 2019 వరకు దీని గురించి పట్టించుకోకుండా 2019లో శిలాఫలకం వేసి వదిలేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పిరియా సాయిరాజ్ కృషి మేరకు రూ.45లక్షలతో ఆ ప్రాంతంలో అద్భుతమైన సిమ్మెంట్ రోడ్డును నిర్మించారు.

కలల వంతెన..

అరకభద్ర–కొళిగాం గ్రామాల మధ్య వంతెన ఇది. దీన్ని కూడా టీడీపీ నాయకులు దశాబ్దాలుగా హామీగానే వాడుకున్నారు. 2018 నవంబర్ 28న స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్, ఎంపీ రామ్మోహన్‌నాయుడు సంయుక్తంగా శిలాఫలకం వేశారు. ఎన్నో ఏళ్ల నుంచి స్థానికులు విన్నవించినా వారు పట్టించుకోలేదు. ఎన్నికల ముందు మాత్ర శిలాఫలకాల నాటకాలు ఆడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక పిరియా సాయిరాజ్ కృషితో మళ్లీ వంతెనకు రీ టెండర్‌తో రూ.1380.28 లక్షలతో వంతెన పనులు దాదాపు పూర్తి దశకు చేర్చారు.





వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పూర్తి దశకు చేరుకున్న అరకబద్ర వంతెన (ఇన్‌సెట్లో) వంతెన లేక నదుంలోతు నీటిలో కొళిగాం వెళ్తున్న ప్రజలు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మితమైన గ్రోయిన్ (ఇన్‌సెట్) రైతులు శ్రమకోర్చి సొంతంగా నిర్మించుకుంటున్న దృశ్యం

అన్నదాతకు వెన్నుదన్ను

టీడీపీ పాలకుల నిర్లక్ష్యానికి అసలుసిసలు బాధితులు వీరు. కేశుపురం, బూర్జపాడు, డొంకూరు, నీలాపుట్టుగ, సన్యాసిపుట్టుగ, లక్ష్మీపురం, శివకృష్ణాపురానికి చెందిన వందలాది మంది రైతులు కేశుపురం వద్ద గ్రోయిన్ కట్టాలని ఎంతగా వేడుకున్నా ఇచ్ఛాపురం టీడీపీ నాయకులు పట్టించుకోనేలేదు. కల్లబొల్లి కబుర్లు చెబుతూ అటు ఎంపీ రామ్మోహన్ నాయుడు, ఇటు ఎమ్మెల్యే బెందాళం అశోక్‌లు కాలక్షేపం చేశారు. సుమారు 1200 ఎకరాల్లో పంట పండని పరిస్థితిలో ఏం చేయాలో పాలుపోని రైతులు సొంతంగా వేలాది రూపాయలు నిధులు కూడబెట్టి ఇసుక బస్తాలతో తాత్కాలిక గ్రోయిన్ ఏర్పాటు చేశారు. కానీ అది కూలిపోయింది. దీనికి స్పందించిన జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజులు గ్రోయిన్ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడంతో రూ.28లక్షలు మంజూరు చేశారు. స్థానిక రైతులు గ్రోయిన్‌ను నిర్మించేందుకు ముందుకు రావడంతో రెండు నెలల్లో పనులు పూర్తయ్యాయి. గత ప్రభుత్వం హామీలతో కాలయాపన చేస్తే, నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేతలతో పనులు పూర్తి చేసింది.

క్లుప్తంగా

ఘనంగా మహాలింగార్చన



మహాలింగార్చన నిర్వహిస్తున్న అర్చకులు

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో మాసశివరాత్రి సందర్భంగా సోమవారం ఉదయం అనివెట్టి మండపంలో మహాలింగార్చన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో మహాపర్వం శివ పంచాయతన సహిత మహాలింగార్చనను అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌కు దరఖాస్తుల ఆహ్వానం



ఎ.విజయ్‌కుమార్

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో హెవీ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణ పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్టీసీ జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయకుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్(ఫోర్ వీలర్) ఉన్న అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్లో ఇప్పటివరకు 15 బ్యాచ్‌లకు గాను సుమారు 250 మంది డ్రైవర్లు విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకొని హెవీ లైసెన్స్ పొందారని తెలిపారు. ప్రస్తుతం 16వ బ్యాచ్‌కు అడ్మిషన్లు జరుగుతున్నాయని, 16 సీట్లు మాత్రమే ఉంటాయని చెప్పారు. శిక్షణతో పాటు మెకానికల్ వర్క్, యోగా, వ్యక్తిత్వ వికాసం, ప్రథమ చికిత్స, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ఫీజు, ఇతర వివరాలకు 9963091999, 73829 23293 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పుస్తెలతాడు చోరీ



బాధితురాలు మల్లారెడ్డి పద్మ

మెళియాపుట్టి: మండలంలోని జాడుపల్లి గ్రామంలో మహిళ ధరించిన పుస్తెలతాడును గుర్తు తెలియని వ్యక్తులు తెంచుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జాడుపల్లి గ్రామానికి చెందిన మల్లారెడ్డి పద్మ సోమవారం మధ్యాహ్నం వంటకు కట్టెలు తీసుకురావడానికి వెళ్లింది. కట్టెలు తీసుకొనుండగా గ్రామ శివారులో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి మహిళ మెడలో ఉన్న 2 తులాల బంగారు పుస్తెలతాడు తెంచుకుని పలాస వైపు వెళ్లిపోయారు. బాధితురాలు కేకలు వేసినా ఫలితం లేకపోయింది. పద్మ ఫిర్యాదు మేరకు ఎస్సై రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు. తూముకొండ పరిసర ప్రాంతంలో ఉన్న ఆకులమ్మ ఆలయం వద్ద సీసీ కెమెరాలు పరిశీలించారు.


కమ్యూనిస్టు నేత శ్రీరాములు మృతికి సంతాపం



బమ్మిడి శ్రీరాములు (ఫైల్)

వజ్రపుకొత్తూరు రూరల్ : 70 ఏళ్ల పాటు కమ్యూనిస్ట్ నాయకుడిగా గిరిజనులు, కార్మిక, కర్షకుల పక్షాన నిలుస్తూ అనేక పోరాటాలు చేసిన సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు కామ్రేడ్ బమ్మిడి శ్రీరాములు(91) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లి గ్రామానికి చెందిన బమ్మిడి శ్రీరాములు వామ పక్ష భావాలకు ఆకర్షితులై 20 ఏళ్ల వయస్సులోనే ఉద్యమబాట పట్టారు. అణగారిన వర్గాల ప్రజల పక్షాన నిలుస్తూ అనేక పోరాటాలు చేసి ఆరేళ్ల పాటు అజ్ఞాతవాస జీవితంతో పాటు రెండేళ్ల జైలు జీవితాన్ని అనుభవించారు. శ్రీరాములు మృతి పట్ల సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి, లిబరేషన్ నాయకులు టి.సన్యాసినాయుడు, న్యూ డెమొక్రసీ నాయకులు వి.మాధవరావు, తామాడ త్రిలోచన, బి.వాసుదేవరావు, నెయ్యిల మోహన్ సంతాపం తెలియజేసారు. శ్రీరాములు తనయుడు బమ్మిడి ఆనందరావు సీపీఎం పార్టీ, కౌలు రైతు సంఘ జిల్లా నాయకులుగా పని చేస్తున్నారు.

ప్రశాంతంగా ఐసెట్



విద్యార్థుల హాల్ టికెట్లు పరిశీలిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకు సంబంధించిన ఐసెట్ – 2024 ప్రవేశ పరీక్ష చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు షిఫ్టుల్లో సోమవారం జరిగింది. మొదటి షిఫ్టులో 120 మందికి 106 మంది, రెండో షిఫ్టులో 120 మందికి 113 మంది హాజరయ్యారు. ఐసెట్ అబ్జర్వర్లు పరీక్ష పర్యవేక్షించారు.

నందిగాంలో సామూహికంగా వైఎస్సార్‌సీపీ కండువాలు ధరించిన మాజీ వలంటీర్లతో పేరాడ తిలక్, కాయల వెంకటరెడ్డి



జగనన్న గెలుపునకు మేమంతా సిద్ధం



ఎచ్చెర్ల క్యాంపస్: డి.మత్స్యలేశంలో జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే కిరణ్

నందిగాం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామంటూ నందిగాం మండలంలో ఇటీవల రాజీనామా చేసిన 330 మంది వలంటీర్లు ముక్తకంఠంతో నినదించారు. సోమవారం నందిగాంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, టెక్కలి నియోజకవర్గ పరిశీలకుడు కాయల వెంకటరెడ్డి సమక్షంలో వీరంతా వైఎస్సార్‌సీపీ కండువాలు ధరించారు. ఈ సందర్భంగా పలువురు వలంటీర్లు మాట్లాడుతూ జగనన్న ఆశయాలకు అనుగుణంగా ఎలాంటి వివక్ష లేకుండా, పార్టీలకు అతీతంగా పథకాలు, పింఛన్లు అందజేశామని గుర్తుచేశారు. జగనన్నకు అండగా నిలవాలని తలచి గతంలోనే రాజీనామాలు సమర్పించామని తెలిపారు. తాను అధికారంలోకి వస్తే వలంటీర్లకు జీతాలు పెంచుతానని చంద్రబాబు మాయమాటలు చెప్పి చెబుతున్నారని, ఆయన మాటలు నమ్మే పరిస్థితి లేదన్నారు. జగనన్నకు అండగా నిలవాలని తలచి సామూహికంగా పార్టీకు సేవ చేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. అనంతరం తిలక్ మాట్లాడుతూ జగనన్న మేనిఫెస్టోను ప్రజలలోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని సూచించారు. కాయల వెంకటరెడ్డి మాట్లాడుతూ వలంటీర్లను అడ్డుకున్న చంద్రబాబుకు మే13న జరిగే ఎన్నికల్లో బుద్ధిచెప్పాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు తమిరె ఫాల్గుణరావు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి జయరాం, నాయకులు యర్ర చక్రవర్తి, కురమాన బాలకృష్ణారావు, కింతల ధర్మారావు, చిన్ని జోగారావు, పెయ్యిల కృష్ణారావు, సైలాడ లావన్న, అట్టాడ శ్రీనివాస్, బార్నాన బాలక్రిష్ణ, రోణంకి బాబూరావు, పూడి ఆశారాణి, కోనారి రామారావు, పల్ల అప్పారావు, బొంగి హనుమంతురావు, రేగల కూర్మారావు, మల్ల సీతారాం, పాము అచ్చెయ్య, కూన శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి టీడీపీ నేత, రెడ్డిక సంఘ నాయకుడు కల్లి సీతారాంరెడ్డితోపాటు మరో 20 కుటుంబాల వారు టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ సమక్షంలో సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో సర్పంచ్ కాల్ల సంజీవరావు, ఎంపీటీసీ కె.శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు చింతాడ వరుణ్, చింతాడ అనిరుద్రుడు, కె.విశ్వనాథరెడ్డి, తలగాన గణపతి పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని డి.మత్స్యలేశంలో 20 జనసేన కుటుంబాలు ఎమ్మెల్యే కిరణ్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో ఉప్పాడ సురేష్, చోడిపల్లి అప్పారావు, చీకటి లక్ష్మయ్య తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ ఇన్‌చార్జి మూగి శ్రీరాములు, ఎంపీటీసీ చోడిపల్లి వలసమ్మ పాల్గొన్నారు.

కాశీబుగ్గ: మున్సిపాలిటీలో 26వ వార్డు గొల్లవీధికి చెందిన యువత వార్డు పెద్దలు మల్లా భాస్కరరావు, మల్లా కామేశ్వరరావు ఆధ్వర్యంలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో సువర్ణపురం భానుమతి, లక్కోజి మురళి, కొక్కిరిగెడ్డ రమణ, పిట్ట కిరణ్‌కుమార్, అంధవరపు కార్తీక్, సురేంద్ర, అభిరాం ఉన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి తంగుడు కనకరాజు పాల్గొన్నారు.



కాశీబుగ్గ: భానుమతికి వైఎస్సార్ సీపీ కండువా వేస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు



కోటబొమ్మాళి: ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ సమక్షంలో పార్టీలో చేరిన రెడ్డిక సంఘ నాయకుడు సీతారాంరెడ్డి

కరుణించిన వరుణుడు



పాతపట్నంలో వర్షం పడుతున్న దృశ్యం

పాతపట్నం: అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో విలవిల్లాడిన ప్రజానీకానికి సోమవారం కురిసిన వర్షం ఉపశమనమిచ్చింది. పాతపట్నం మండలంలో సాయంత్రం కుండపోతగా వాన కురిసింది. మార్కెట్ రోడ్డు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సుమారు గంట సేపు రాకపోకలకు స్తంభించాయి. కొరసవాడ, కాగువాడ, బురాగాం తదితర గ్రామాల్లో పంట పొలాల్లో నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కొత్తూరు: మండలంలోని కొత్తూరు, పారాపురం, కల్లెమ్మ, మెట్టూరు, గునభద్ర, కుంటిభద్ర, మహర్తాపురం తదితర గ్రామాల్లో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. పలుచోట్ల ఈదురు గాలులు వీచాయి.

శ్రీకాకుళం పాతబస్టాండ్: వాతావరణంలోవచ్చిన మార్పులు కారణంగా మంగళవారం నుంచి గురువారం వరకు జిల్లాలో వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. మోస్తరు నుంచి అతి భారీ వర్షాలు కూడా పడే అవకాశముందని, వర్షంతో పాటు గాలులు కూడా వీస్తాయని తెలిపారు.

కవిటి: రాష్ట్రంలో రెండో కోనసీమగా గుర్తింపుపొందిన కవిటి ఉద్దానం కొబ్బరిరైతుకు సోమవారం సాయంత్రం కురిసిన తొలకరి వర్షం సంజీవనిలా మారింది. ఉగాది పండుగ తర్వాత మండలవ్యాప్తంగా సుమారు 45 నిమిషాలపాటు భారీవర్షం కురిసింది.రాత్రి వరకు చిరుజల్లులు పడుతుండడంతో కొబ్బరి పంటకు మేలు చేకూరుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం జగన్‌తోనే దళితుల సంక్షేమం



స్పీకర్ తమ్మినేని సీతారాంను సత్కరించిన దళిత నాయకులు

ఆమదాలవలస : హితవాది వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, వితండవాది చంద్రబాబు అని ఆమదాలవలస ఎమ్మెల్యే అభ్యర్థి, స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. దళితవాడలను ప్రత్యేక పంచాయతీలుగా చేస్తామని సీఎం జగన్ ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ తైక్వాండో శ్రీను, కంట వేణు ఆధ్వర్యంలో పలువురు దళిత నేతలు సోమవారం స్పీకర్ తమ్మినేనిని ఆమదాలవలసలోని ఆయన స్వగృహంలో కలిశారు. దళితుల ఉన్నత ఆకాంక్షించే ముఖ్యమంత్రి దొరకడం ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం చేసుకున్న అదృష్టమన్నారు. అనంతరం తమ్మినేనిని సత్కరించారు. అక్కడికి చేరిన దళిత నేతలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేగా తమ్మినేని సీతారాంను, ఎంపీగా పేరాడ తిలక్‌ను అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు.

కంచరానకు కవితా పురస్కారం



కంచరాన భుజంగరావు

శ్రీకాకుళం కల్చరల్ : శ్రీకాకుళంకు చెందిన కంచరాన భుజంగరావు పల్లా జాతీయ కవితా పురస్కారం–2024కు ఎంపికయ్యారు. ఈ మేరకు వైఎస్ఆర్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన యువ సాహితీ సేవా సంస్థ అధ్యక్షుడు పల్లా కృష్ణ సమాచారం అందించారని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాను రచించిన 'నీటి గింజల పంట' వచన కవిత ఈ పురస్కారానికి ఎంపికైనట్లు తెలిపారు.

మీడియేటర్ ఎంప్యానల్‌కు దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: న్యాయవ్యవస్థలో మీడియేటర్లుగా ఎంప్యానల్ అయ్యేందుకు విశ్రాంత న్యాయాధికారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని న్యాయసదన్‌లో ఆయన మాట్లాడుతూ న్యాయవ్యవస్థకు అనుసంధానంగా, మధ్యవర్తులుగా, ఎంప్యానల్ కావడానికి విశ్రాంత న్యాయాధికారులు, విశ్రాంత సివిల్ జడ్జిలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తులను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయానికి అందజేయాలన్నారు. ఉన్నత న్యాయసేవాధికార సంస్థ నిర్ణయం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

8న ముగ్గుల పోటీలు

శ్రీకాకుళం కల్చరల్ : ఎన్నికల నేపథ్యంలో ఓటు ఆవశ్యకత తెలియజేసేందుకు ఈశ్వర్ ఆర్ట్స్ డిజిటల్స్, ఆరోహి కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఈ నెల 8న ఉదయం 8 గంటలకు కలెక్టర్ బంగ్లా వద్ద ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చోడవరం ఈశ్వరరావు, పెంకి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 'ఓటు వేయడం–ఆవశ్యకత' అనే అంశంపై ముగ్గు వేయాలని.. ఎటువంటి రాజకీయ ముద్రలు గానీ, ముఖ చిత్రాలుగానీ ఉండకూడదని స్పష్టం చేశారు. 9న జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 'ఓటుపై అవగాహన' అనే అంశంపై వ్యాసరచన పోటీలు, 10న 'ఓటు ఎందుకు వేయాలి' అనే అంశంపై చిత్రలేఖన పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. పెద్ద ఎత్తున విద్యార్థులు, మహిళలు పాల్గొనాలని, విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

- వైఎస్సార్‌సీపీ లోకి చేరికలతో టీడీపీకి ఓటమి భయం
- విజయోత్సాహంతో తిలక్, దువ్వాడ ప్రచారాలు

టెక్కలి వైఎస్సార్ సీపీలో..

నూతనోత్సాహం



ఇటీవల టెక్కలిలో ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన మేఘవరం పంచాయతీ టీడీపీ కార్యకర్తలు

టెక్కలి: వైఎస్సార్‌సీపీ పాలనలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందజేసిన ఇంటింటా సంక్షేమ పథకాలతో టీడీపీకి ఓటమి భయం పట్టుకుంది. తెలుగుదేశం నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీలోకి చేరికలు ఊపందుకున్నాయి. టెక్కలి నియోజకవర్గంలో సుమారు రూ.4361.91 కోట్లతో మూలపేట పోర్టు నిర్మాణం ఒక మైలురాయిగా నిలిచింది. టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆ పార్టీ నుంచి బరిలో ఉన్నప్పటికీ కరోనా వంటి కష్టకాలంలో నియోజకవర్గంలో ప్రజల యోగ క్షేమాలను ఏ కోశాన పట్టించుకోలేదు. ఇదే సందర్భం అచ్చెన్నాయుడిని ఓటమి భయానికి చేరుస్తోంది. దీంతో ఏం చేయాలో తెలియక టీడీపీలో ఉన్న వారికే మరోసారి కండువాలు కప్పి చేరికల కలరింగ్ ఇస్తున్నారు. మరోవైపు ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ ఇరువురూ టెక్కలి నియోజకవర్గానికి చెందిన నాయకులు కావడంతో, ఈ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పక్కా ప్రణాళికతో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇటీవల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టెక్కలిలో మేమంతా సిద్ధం బహిరంగ సభకు అత్యధికంగా ప్రజాదరణ లభించడంతో, టీడీపీ నాయకులకు ముచ్చెమటలు పడుతున్నాయి. మరో వైపు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా మండల, గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు విస్తృతంగా 'ఫ్యాన్' గుర్తు ప్రచారాలు చేస్తున్నారు.

ఇటీవల చేరికలు..

- టెక్కలి మండలం మేఘవరం పంచాయతీ గిరిజన గ్రామాల్లో టీడీపీ నుంచి సుమారు 150 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ లోకి చేరారు. ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో ఇటీవల మేఘవరం పంచాయతీ నుంచి 150 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. టెక్కలి మండలం లింగాలవలస పంచాయతీ సన్యాసిపేట గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు 40 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ కండువాలు ధరించారు.
- టెక్కలి మండలం పెద్దసాన గ్రామానికి చెందిన జనసేన కార్యకర్తలు బొడ్డేపల్లి వంశీ, వంకల మల్లేష్, కొర్రాయి వేణుగోపాల్ తదితరులు వైఎస్సార్‌సీపీలోకి చేరారు.
- టెక్కలికి చెందిన సుమారు 52 వైశ్య కుటుంబాలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. గూడెం పంచాయతీకి చెందిన టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థి భర్త గండేటి చిన్నారావుతో పాటు తలగాన చిన్నారావు, గండేటి బాల గోవింద్, గండేటి రామయ్య తదితర 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి చేరాయి.
- కోటబొమ్మాళి మండలం కస్తూరిపాడు టీడీపీ మాజీ సర్పంచ్ ససపల నాగేశ్వరరావుతో పాటు సుమారు 50 కుటుంబాలు దువ్వాడ శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వీరు 1983 నుంచి టీడీపీలో క్రియాశీలంగా వ్యవహరిస్తున్నారు.
- కోటబొమ్మాళి మండలం కన్నెవలసకు చెందిన టీడీపీ కీలక నాయకుడు పంగ యోగేశ్వరరావుతో పాటు మరో 15 కుటుంబాలు ఇటీవల టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. ఈయన 30 ఏళ్లుగా టీడీపీ నాయకుడు అచ్చెన్నాయుడుకి అత్యంత సన్నిహితుడిగా ఉండేవారు.
- కోటబొమ్మాళి మండలం పాకివలస, రామయ్యపేట కు చెందిన యాదవ కుల సంఘ నాయకులు ముద్ద రామదాసు, ఇద్దిబోయిన నారాయణరావుతో పాటు మరో 15 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీ కండువాలు ధరించారు.
- సంతబొమ్మాళి మండలం మర్రిపాడు పంచాయతీ నుంచి అట్టాడ శ్యామ్‌సుందర్రావు, బండ మల్లేష్, గిన్ని భీమారావు తో పాటు సుమారు 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు.
- కోటబొమ్మాళి మండలం నీలంపేట పంచాయతీకి చెందిన టీడీపీ కార్యకర్తలు బొట్ట చిన్నప్పడు, పిట్ట అప్పయ్య, పల్ల రాజారావు, బుర్లి సూర్యనారాయణ, కొల్లి రాము, బొట్ట అప్పలరాజు, బొమ్మాళి తవిటయ్యతో పాటు సుమారు 100 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలోకి చేరారు.
- నందిగాం మండలం పెద్దబాణాపురం గ్రామానికి చెందిన పెయ్యిల కృష్ణారావు కొన్నేళ్లుగా తెలుగుదేశంలో కీలకంగా ఉండేవారు. దళిత సామాజిక వర్గంలో పట్టు ఉన్న ఈయన పేరాడ తిలక్ సమక్షంలో గ్రామానికి చెందిన 20 కుటుంబాలతో కలిసి వైఎస్సార్ సీపీలో చేరారు.
- నందిగాం మండలం కవిటిఅగ్రహారంలో దట్టి జగ్గయ్యతో సహా 15 కటుంబాలు వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నాయి.హరిదాసుపురం గ్రామానికి చెందిన చెందిన సీమల రాములమ్మ తెలుగుదేశంపార్టీలో క్రియాశీలక కార్యకర్త. ఇటీవల స్థానిక నాయకుడు కణితి నారాయణమూర్తి సమక్షంలో 8 కుటుంబాలతో వైఎస్సార్‌సీపీలోకి చేరారు.
- నందిగాం మండలం రాంపురం గ్రామానికి చెందిన చెందిన టీడీపీ నేత యవ్వారి అరుణ్‌కుమార్ 10 కుటుంబాలతో పేరాడ తిలక్, దువ్వాడ శ్రీనివాస్‌ల సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు.
- నందిగాం మండలం హర్షబడకు చెందిన 20 కుటుంబాలు పేరాడ తిలక్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఇదే పంచాయతీ పెద్దగురువూరులో 20 కుటుంబాలకు చెందిన 50 మంది కూడా పార్టీ కండువాలు ధరించారు. దిమ్మడిజోలకు చెందిన కొల్లి చలపతిరావు ఆధ్వర్యంలో 10 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి.



నందిగాం మండలం పెద్దబాణాపురంలో పేరాడ తిలక్ సమక్షంలో పార్టీలో చేరుతున్న పెయ్యిల కృష్ణారావు తదితరులు



కోటబొమ్మాళి మండలం నీలంపేట పంచాయతీలో వైఎస్సార్‌సీపీలోకి చేరిన టీడీపీ కార్యకర్తలు



సంతబొమ్మాళి మండలం మర్రిపాడులో వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారితో దువ్వాడ

పదేళ్ల బెండాళం అవినీతికి అందలం



అంగన్‌వాడీ న్యూట్రిషన్ పోస్టుకు రూ.లక్ష, మున్సిపాలిటీలో అటెండర్ పోస్టుకు రూ.3 లక్షలు..ఇదేంటని అనుకుంటున్నారా..? ఇచ్ఛాపురంలో ఎమ్మెల్యే బెండాళం అశోక్ ఫిక్స్ చేసిన రేట్లు ఇవి. కొలువుల్లోనే కాదు కాంట్రాక్టులు, క్వారీలు, ఆఖరుకు తిత్లీ పరిహారంలోనూ అవినీతికి పాల్పడ్డారు. పదేళ్ల పదవీ కాలాన్ని ప్రజల కోసం కాకుండా సొంత ఆస్తులు పెంచుకోవడానికే వాడుకున్నారు. ఇప్పటికే కొందరు అంగన్‌వాడీ సిబ్బందితో పాటు గిరిజనులు కూడా అశోక్ వైఖరిపై తిరగబడ్డారు. ఇప్పుడు నియోజకవర్గ వ్యాప్తంగా ఆయనకు వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి.

- పదేళ్లలో రెండు చేతులా సంపాదించిన బెండాళం అశోక్
- కాంట్రాక్టు ఉద్యోగాల పేరిట రూ.లక్షల్లో కమీషన్లు
- ఇసుక దందాల్లో భారీగా వాటాలు
- అంగన్‌వాడీ పోస్టుల్లో అవినీతి
- ఇప్పటికే తిరగబడిన గిరిజనులు, అంగన్‌వాడీ ఉద్యోగులు

పచ్చ పాపాలు-12



ఎమ్మెల్యే అశోక్‌ను చుట్టుముట్టిన బాధిత న్యూట్రిషన్ కౌన్సిలర్లు(ఫైల్)

సాక్షి నెట్‌వర్క్:

ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో ఉన్న ఇచ్ఛాపురం దశాబ్దాలుగా అభివృద్ధికి దూరంగా ఉండిపోయింది. ఇక్కడి ప్రజలు ఎంతో ప్రేమగా చాలా సార్లు టీడీపీ అభ్యర్థులను గెలిపించారు. కానీ ఆ టీడీపీ ఎమ్మెల్యేలు అదే ప్రేమను ఈ ప్రాంతంపై చూపించలేకపోయారు. ఆస్తులు పెంచుకోవడానికి తప్ప అభివృద్ధికి ఏనాడూ పనిచేయలేదు. ఫలితంగా ఈ ప్రాంతానికి వెనుకబాటు తప్పలేదు. ఇక్కడ వరుసగా గత రెండు సార్లు నెగ్గి బెండాళం అశోక్ కూడా ఆ అవినీతి తానులోని ముక్కే. సాయం కోసం అర్థించిన ప్రజలపైన మానవత్వం చూపకుండా వసూళ్లకు పాల్పడ్డారు. ఉద్యోగుల నుంచి ఇసుక దందాల వరకూ కమీషన్లు రాబట్టారు.

ఉద్యోగ నియామకాల్లో..

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 287 మంది అంగన్‌వాడీ న్యూట్రిషన్ కౌన్సిలర్ పోస్టులకు నోటిఫికేషన్ వెలువడగా, వాటిని ఎమ్మెల్యే అశోక్ క్యాష్ చేసుకున్నారు. ఒక్కో పోస్టుకు రూ.50వేలు నుంచి రూ.ఒక లక్ష వరకు వసూలు చేశారు. మొత్తంగా సుమారు రెండున్నర కోట్లు వరకు దండుకున్నారు. ఈ న్యూట్రిషన్ పోస్టుల్ని నిలిపివేసిన తర్వాత సంబంధిత ఉద్యోగులు ఎమ్మెల్యే అశోక్‌ను నిలదీశారు కూడా. ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో కూడా ఒక అటెండర్ పోస్టుకు రూ.3లక్షలు వరకు తీసుకున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

తుఫాన్ సాయం కూడా..

- సోంపేట, కవిటి మండలాల్లో హుద్‌హుద్ తుఫాను బాధితుల కోసం మంజూరు చేసిన ఇళ్లను కూడా కేటాయించడంలో అక్రమాలకు పాల్పడ్డారు.

కాంట్రాక్టర్ల వద్ద వసూళ్లు..

నియోజకవర్గంలో ప్రభుత్వపరంగా చేపట్టే పనులకు కాంట్రాక్టర్ల వద్ద పెద్ద ఎత్తున ముందే కమీషన్లు రాబట్టుకున్నారు. అంతేకాకుండా బినామీల పేర్లతో కాంట్రాక్టు పనులకు టెండర్లు వేయించి, పనుల్ని కూడా నాసిరకంగా చేపట్టినప్పటికీ పూర్తిస్థాయిలో బిల్లులు ఇప్పించారు. అందులో చేతివాటం ప్రదర్శించారు. నియోజకవర్గవ్యాప్తంగా చేపట్టిన వివిధ పనుల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

కమీషన్లకు కక్కుర్తిపడి అనర్హులకు కట్టబెట్టారు.

- తిత్లీ తుఫాను సంభవించి ఉద్యాన పంటలు ఛిన్నాభిన్నమైన సంగతి తెలిసిందే. ఆ విపత్తును కూడా అశోక్ తనకు అనుకూలంగా మార్చుకున్నారు. బాధితులకు ఇచ్చే నష్టపరిహారాన్ని నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న బినామీలకు ఎక్కువ శాతం కట్టబెట్టారు. బినామీల పేర్లు రాసి చేతివాటం ప్రదర్శించారు. కొబ్బరి చెట్ల పరిహారంలోనూ డబ్బులు దండుకొన్నారు.

ఇసుక క్వారీల్లోనూ..

బాహుదా, మహేంద్రతనయ నదుల్లో పెద్ద ఎత్తున ఇసుక తవ్వకాలను పాల్పడ్డారు. అతని అనుయాయులతో ఇసుక తవ్వకాలకు పాల్పడ్డారు. ముఖ్యంగా ఇచ్ఛాపురం మండలంలో బాహుదా నదీ పరివాహక గ్రామాల్లోను, సోంపేట మండలంలో మహేంద్రతనయ నదీ పరివాహక గ్రామాల్లో తన అనుయాయుల ద్వారా పెద్ద ఎత్తున ఇసుక దందాకు పాల్పడి కోట్లలో సొమ్ములు వెనకేసుకొన్నారనే ఆరోపణలున్నాయి. అదేవిధంగా కంచిలి మండలంలో నువాగడ గిరిజన పంచాయతీలో నువాగడ గిరిజన గ్రామానికి ఆనుకొని ఉన్న కొండలో గ్రానైట్ నిక్షేపాలున్నాయని తెలుసుకొని, అతని బంధువు ద్వారా టెండర్ వేయించి ఆ క్వారీని దక్కించుకొన్నారు. అక్కడ కార్యకలాపాలు ప్రారంభించడానికి వెళ్లిన సిబ్బందిని స్థానిక గిరిజనులు అడ్డుకొన్నారు. అప్పట్లో కొన్నాళ్ల పాటు నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో, అక్కడ పనులు నిలిచిపోయాయి. కంచిలి మండలంలో బంజిరి నారాయణపురం గ్రామానికి ఆనుకొన్న కొండలో కంకర క్వారీని కూడ అశోక్ అనుయాయులు దక్కించుకొన్నారు. అక్కడ కార్యకలాపాలు ప్రారంభించిన సమయంలో కూడా స్థానికులు పెద్ద ఎత్తున తిరగబడటంతో గత్యంతరం లేక ఆపేశారు.



బాతుపురం గ్రామం వద్ద మహేంద్రతనయ నదిలో ఇసుక అక్రమ రవాణా (ఫైల్)



ఈదుపురం బాహుదా నదిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు

క్లుప్తంగా

1100 లీటర్ల సారా ఊటలు ధ్వంసం



సారా స్థావరాలపై దాడులు నిర్వహిస్తున్న సిబ్బంది

మెళియాపుట్టి: మండలంలోని జోడూరు పంచాయతీ జన్నిబంద గ్రామంలోని కొండ ప్రాంతంలో సారా తయారీ స్థావరాలపై టెక్కలి, పలాస ఎస్ఈబీ, డీటీఎఫ్ పోలీసులు సమష్టిగా దాడులు నిర్వహించారు. సోమవారం నిర్వహించిన ఈ దాడుల్లో 1100 లీటర్ల పులిసిన బెల్లపు ఊటలు ధ్వంసం చేసి, 30 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రాజశేఖర్ నాయుడు తెలిపారు. వినియోగించిన ప్లాస్టిక్ డ్రమ్ములు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో టెక్కలి ఎస్ఈబీ సీఐ రాజశేఖర్ నాయుడు తో పాటుగా పలాస డీటీఎఫ్ సీఐ రామచంద్ర కుమార్ పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి పెన్‌కాక్ సిలాట్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలో జరిగిన 9వ ఏపీ రాష్ట్రస్థాయి పెన్‌కాక్ సిలాట్(మార్షల్ ఆర్ట్స్) క్రీడా పోటీలు ముగిశాయి. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఢిల్లీ ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూల్ వేదికగా ఈనెల 5,6 తేదీల్లో జరిగిన ఈ పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ పోటీలకు రాష్ట్ర నలుమూలల నుంచి 350 మంది బాలబాలికలు ప్రాతినిధ్యం వహించారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. డీపీఎస్ డైరెక్టర్ ముద్దాడ సత్యప్రసాద్, ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ సూర శ్రీనివాసరావు విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో టోర్నమెంట్ చీఫ్, గ్రాండ్ మాస్టర్ రేగిడి దయామయ, పెన్‌కాక్ సిలాట్ జిల్లా ప్రధాన కార్యదర్శి నక్క లక్ష్మణనాయుడు, సౌత్‌జోన్ సెక్రటరీ టి.మనోజ్‌సాయి, రాష్ట్ర కార్యదర్శి విజయభరద్వాజ్, రిఫరీలు ఎం.వెంకటరావు, వంశీకృష్ణ, ఎల్.ఈశ్వరరావు, హేమంత్‌కుమార్, ఎం.గౌతమి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు. డీపీఎస్ పాఠశాలలోనే క్రీడాకారులకు వసతి, భోజన ఏర్పాట్లు కల్పించారు.

‘ప్రత్యేక’ దాడులు ముమ్మరం

- ఎన్నికల నేపథ్యంలో సెబ్, ఎక్సైజ్ విస్తృత తనిఖీలు
- అనధికార మద్యం, సారా రవాణాపై ప్రత్యేక దృష్టి

శ్రీకాకుళం క్రైమ్ : ఎన్నికల నేపథ్యంలో జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్), ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ విభాగాలు సంయుక్తంగా ప్రత్యేక దాడులు ముమ్మరం చేశాయి. ప్రభుత్వ మద్యం దుకాణాల్లోనే కాకుండా బార్లలో వరుస తనిఖీలు జరపడమే కాక అనధికార మద్యం, బెల్టు షాపుల నిర్వహణ, సారా నిల్వలు, గంజాయి వంటి అక్రమ రవాణా అడ్డుకట్ట వేసేందుకు విస్తృతంగా సోదాలు జరుపుతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి ఇప్పటివరకు ఈ రెండు విభాగాలు కలిపి 640 కేసులు నమోదు చేసి 582 మందిని అరెస్టు చేశారు.

దాడుల్లో ‘స్పెషల్ ’

జాయింట్ డైరెక్టర్ డి.గంగాధరం నేతృత్వంలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసులు దాడుల్లో స్పెషల్ అనిపించుకుంటున్నారు. ఎలక్షన్ కమిషన్ మొదటి సమావేశం (గత ఏడాది డిసెంబరు 26) తర్వాత నుంచి చూసుకుంటే 42,923 లీటర్ల లిక్కర్, 69 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.1,44,27,726 ఉంటుంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల నాటి నుంచి ఇప్పటి వరకు చూసుకుంటే 613 కేసుల్లో 555 మందిని అరెస్టు చేసి 21 వాహనాలను సీజ్ చేశారు. వీటిలో ఐడీ లిక్కర్ (నాటుసారా) విషయానికొస్తే.. 2,886 లీటర్ల సారాయి (ఐడీ లిక్కర్)ని స్వాధీనం చేసుకుని 83,625 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేయగా 116 కేసుల్లో 49 మందిని అరెస్టు చేసి ఎనిమిది వాహనాలను సీజ్ చేశారు. బయట రాష్ట్రాలకు చెందిన ఎన్‌డీపీఎల్ మద్యం 307(ఐఎంఎల్ 88.38 లీటర్లు, బీర్లు 219.35లీటర్లు) లీటర్లు స్వాధీనం చేసుకుని 48 కేసుల్లో 52 మందిని అరెస్టు చేసి నాలుగు వాహనాలను సీజ్ చేశారు. మన రాష్ట్రానికి చెందిన డీపీఎల్ లిక్కర్ 1435 లీటర్లు (ఐఎంఎల్ 1299.74 లీటర్లు, బీర్లు 137.8 లీటర్లు) స్వాధీనం చేసుకుని 449 కేసుల్లో 454 మందిని అరెస్టు చేసి తొమ్మిది వాహనాలను సీజ్ చేశారు.



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న సెబ్ సిబ్బంది

తనిఖీల్లో ‘ఎక్సైజ్’..

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ బి.సుబ్బారావు నేతృత్వంలోని ఎక్సైజ్ పోలీసులు బార్లు, ప్రభుత్వ మద్యం దుకాణాల్లో(జీఆర్వోల్లో) నిత్యం ఆకస్మిక తనిఖీలు జరుపుతూ అక్రమాలకు అడ్డుకట్ట వేస్తున్నారు. ప్రభుత్వ దుకాణాల్లో పనిచేస్తూ ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన ఐదుగురు సూపర్‌వైజర్లు, 16 మంది సేల్స్‌మెన్‌లను విధుల నుంచి తొలగించి తప్పుచేస్తే ఎవరినైనా వదిలిపెట్టమని సంకేతాలు పంపించారు. ఆకస్మిక వాహన తనిఖీలు జరిపి అధిక మొత్తంలో మద్యం తీసుకువెళ్లి గ్రామాల్లో, వార్డుల్లో బెల్టుషాపులు నడిపేవారిని పసిగట్టి 27 కేసులు నమోదు చేసి 21 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1,05,460 లు విలువ చేసే 146 మద్యాన్ని సీజ్ చేశారు. ఎక్సైజ్ కమిషనర్, ఎండీ సూచనల మేరకు జీఆర్వోలు, బార్లు, డిఫెన్సు క్యాంటీన్లు, బీర్ల తయారీ ఫ్యాక్టరీ, కల్లు దుకాణాలు, ఎక్సైజ్ బాండెడ్ స్థలాలన్నీ ఎన్నికల తేదీ నాటికి 48 గంటల ముందు డ్రై డేగా పాటించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎలాంటి రాజకీయాలకు తావు లేకుండా టోకెన్ సిస్టమ్ లిక్కర్ సరఫరా లేకుండా ముందుగానే జాగ్రత్తపడ్డారు.



వెహికల్ చెకింగ్ చేస్తూ..

వీవీ ప్యాట్‌లో గుర్తు తప్పుగా చూపితే..



హిరమండలం:

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈవీఎంలో ఓటరు తాను వేసిన గుర్తుకే ఓటు పడిందా లేదా అని నిర్ధారించుకునేందుకు వీవీ ప్యాట్‌లో పేపర్ ప్రింట్ ద్వారా పరిశీలించుకోవచ్చు. తాను ఓటు వేసిన గుర్తు ఒకటైతే వీవీ ప్యాట్‌లో మరో గుర్తు పడినట్లు తప్పు ప్రింట్ చూపిస్తే దాన్ని ‘రాంగ్ ప్రింట్ ఆఫ్ వీవీప్యాట్ పేపర్‌స్లిప్’అంటారు.

- ఇలాంటి సందర్భంలో ప్రిసైడింగ్ అధికారి రూల్49ఎంఏ ప్రకారం చర్యలు తీసుకోవాలి.
- అలాగే తన వద్ద ఉన్న హ్యాండ్‌బుక్‌లో అనెక్షర్–15 ప్రకారం ఫిర్యాదు చేసిన ఓటరు వద్ద డిక్లరేషన్‌ను ప్రిసైడింగ్ అధికారి తీసుకోవాలి.
- పోలింగు ఏజెంట్ల సమక్షంలో ప్రిసైడింగ్ అధికారి పోలింగ్‌ను ఆపేసి రిటర్నింగ్ అధికారికి తెలియజేయాలి.
- ఓటరు ఫిర్యాదు తప్పని తేలితే 17ఏ లో ఆ ఓటరు రెండోసారి రాసిన వివరాలు రిమార్క్ కాలమ్‌లో ఓటరు చేసిన ఫిర్యాదు తప్పని రాయాలి
- 17సి అనగా పోలైన ఓట్ల వివరాలు మొదటి భాగంలో (పార్ట్–1) ఆ వివరాలు నమోదు చేయాలి.

ఈవీఎంలు వీవీ ప్యాట్‌లు పనిచేయకపోతే?

- పోలింగ్ సమయంలో ఈవీఎంలు, వీవీప్యాట్‌లు పనిచేయకపోతే వాటి స్థానంలో రిజర్వ్‌లోని వాటిని ఏర్పాటు చేయాలి.
- కొత్త ఈవీఎం,వీవీప్యాట్‌లో మళ్లీ మాక్‌పోల్ నిర్వహించి. డిక్లరేషన్ రాయాలి.

మార్క్‌డ్ ఓటరు వస్తే..

ప్రిసైడింగ్ అధికారి వద్ద ఓటరు జాబితాకు సంబంధించిన వర్కింగ్ కాపీలు, మార్క్‌డ్ కాపీలు ఉంటాయి. అందులో ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్(ఏఎస్‌డీ)జాబితాలో ఉన్న ఓటర్లను మార్కు చేసి ఉంటారు. మార్క్‌డ్ ఓటర్ ఓటు వేయడానికి వస్తే ప్రిసైడింగ్ అధికారి ఆ ఓటరు తెచ్చిన గుర్తింపుతో జాబితాలోని వివరాలను సరిచూడాలి. నిజమైతే 17ఎలో ఆ ఓటరు సంతకంతో పాటు వేలిముద్ర తీసుకుని ఓటు వేసేందుకు అనుమతించాలి. ఏఎస్‌డీ జాబితా నుంచి ఓటు వేసిన వారి వివరాలతో ఓ రికార్డు సిద్ధం చేయాలి.

ఘాట్ రోడ్లలో భారీ వాహనాల రాకపోకలు నిషేధం

- ఈ నెల 10 నుంచి 14 వరకు అమలు
- జిల్లా ఎన్నికల అధికారి ఎం.విజయసునీత

సాక్షి,పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా):

జిల్లాలోని ఘాట్ రోడ్లలో ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు భారీ వాహనాల రాకపోకలను నిషేధిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ దృష్ట్యా సిబ్బంది, సామగ్రిని తరలించేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రెవెన్యూ, పోలీసు, ఆర్‌అండ్‌బీ శాఖలు ముందస్తు చర్యలు చేపట్టినట్టు ఆమె పేర్కొన్నారు.

విజయనగరం జిల్లాలోని బొడ్డవర నుంచి అనంతగిరి,అరకులోయ మీదుగా పాడేరు జాతీయ రహదారి, వడ్డాది–పాడేరు ఘాట్‌రోడ్డు, లంబసింగి, మారేడుమిల్లి–భద్రాచలం ఘాట్‌రోడ్ల మార్గాల్లో భారీ వాహనాల రాకపోకలపై నిషేధం ఉంటుందన్నారు. ఈ రోడ్లపై భారీ వాహనాలు, మల్టీ ఎక్సెల్ సిమెంట్, స్టీల్ రవాణా చేసే వాహనాల రాకపోకలను ఆయా తేదీల్లో నిషేధిస్తున్నామని తెలిపారు. వాహనదారులంతా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ విజయసునీత సూచించారు.

జనంతో కలిసిపోతూ..



కవిటి: ఇచ్ఛాపురం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ సామాన్యుల మనసు గెలుచుకుంటున్నారు. ప్రచారంలో భాగంగా కవిటి మండలంలో వేతనదారులతో ఇలా మాట్లాడారు.

ప్రచార పర్వం

ఎండలను కూడా లెక్క చేయకుండా అభ్యర్థులు ప్రచారాలు కొనసాగిస్తున్నారు. పల్లెలు, పట్టణాలు కలియతిరుగుతూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. ఎందుకు ఓటేయాలో వివరిస్తూ ముందుకు సాగుతున్నారు.



సరుబుజ్జిలి: స్పీకర్ తమ్మినేని సీతారాం ఎండను కూడా లెక్క చేయకుండా ప్రచారం చేస్తున్నారు. ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌తో కలిసి ప్రచార రథంపై యరగాంలో తిరిగారు.



ఎచ్చెర్ల క్యాంపస్: ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ జోరు పెంచారు. కుప్పిలిలో విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో కలిసి ఇలా ఉత్సాహంగా ప్రచారం చేశారు.



జలుమూరు: ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఊళ్లన్నీ చుట్టేస్తున్నారు. సైరిగాంలో జోరుగా ప్రచారం చేశారు.



గార: మంత్రి ధర్మాన ప్రసాదరావు పల్లెలన్నీ కలియతిరుగుతున్నారు. గార మండలంలో ప్రచార రథంపై నుంచి ప్రసంగించారు.



మెళియాపుట్టి : ఎమ్మెల్యే రెడ్డి శాంతి తనదైన శైలిలో దూసుకుపోతున్నారు. శేఖరాపురంలో ఉపాధి వేతనదారులతో కలిసిపోయి మాట్లాడారు.



కాశీబుగ్గ: మంత్రి సీదిరి అప్పలరాజు జనం మనసులు గెలుచుకుంటున్నారు. కేదారిపురంలో మంత్రికి ఇలా ఆప్యాయంగా స్వాగతం పలికారు.



కోటబొమ్మాళి: టెక్కలి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ ప్రచార వేగం పెంచారు. లఖందిడ్డిలో ఉత్సాహంగా ప్రచారం చేశారు.